
శ్రీరాంపూర్ : పూజలు చేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు


శ్రీరాంపూర్ : అమ్మవారికి పూజలు చేస్తున్న మేనేజర్

# వైభవంగా దుర్గామాతకు సారె


మందమర్రి : అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న జీఎం సవితామనోహర్ దంపతులు

- ఒడి బియ్యం సమర్పించిన జీఎం మనోహర్ దంపతులు
- వైభవంగా శోభాయాత్ర

మందమర్రి, అక్టోబర్ 20 : పట్టణంలోని వేంకటేశ్వర ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న దుర్గామాతా నవరాత్రులు ప్రారంభించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం సారె వేడుకలను నిర్వహించారు. స్థానిక మార్కెట్‌లో గల హనుమాన్ ఆలయం నుంచి మేళతాళాలతో శోభాయాత్ర చేపట్టారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ సవిత దంపతులు శోభాయాత్రతో పాటు మండపంలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలందరికీ ఉండాలన్నారు. అధికారులు, ఉద్యోగులు కలిసి కట్టుగా నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించి ప్రగతి పథంలో నడిపించి సంస్థ అభివృద్ధికి పాటు పడాలన్నారు. అనంతరం ఏరియాలోని కేకే ఓసీ ఆలయ ఆవరణలో గల నవరాత్రుల పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఆఫీసర్ కెహెచ్ఎస్ గుప్తా, సివిల్ డీజీఎం శ్రీనివాసులు, ఈఅండ్ఎం ఏజీఎం నాగరాజు, కేకే ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఎల్.రమేశ్, శ్రీవేంకటేశ్వర ఆలయ పూజారులు అనంతాచార్యులు, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

### వర్క్‌షాప్, ఎస్ఆర్పీ 1లో శాంతిహోమం..

శ్రీరాంపూర్, అక్టోబర్ 20 : శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం శాంతి హోమం, ఎస్ఆర్పీ 1గనిపై చండీయాగం నిర్వహించారు. వర్క్‌షాప్‌లో డీజీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, జీఎం సంజీవరెడ్డి పాల్గొని శాంతి హోమం పూజలు చేశారు. పిట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జీఎం సంజీవరెడ్డి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి కూడా పూజలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఎస్ఆర్పీ 1లో మేనేజర్ విజయ్‌కుమార్, ఏజెంట్ గోపాల్‌సింగ్, ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, పిట్ కార్యదర్శి ఎంబడి తిరుపతి చండీయాగంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి, డీజీఎం అరవిందరావు, ఏరియా పీవో పురుషోత్తంరెడ్డి, ఎస్టోటూ జీఎం రఘుకుమార్, డీవైజీఎం చిరంజీవు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు ఓ రవిందర్, మహేశ్‌రాజు, రియాజ్ అహ్మద్, రాజాబాబు పాల్గొన్నారు.

### కైర్‌గూడ ఓసీపీలో..

రెబ్బెన, అక్టోబర్ 20: బెల్లంపల్లి ఏరియాలోని కైర్‌గూడ ఓసీపీలో గల దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో శుక్రవారం కుంకుమపూజ, హోమం నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అర్చకుడు సంతోష్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు. ప్రాజెక్టు అధికారులు సత్యనారాయణ, ఉమాకాంత్, మేనేజర్ ప్రవీణ్‌పాటింగ్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

### ఆర్కే 5గనిపై డైరెక్టర్‌కు సన్మానం..

శ్రీరాంపూర్, అక్టోబర్ 20 : ఆర్కే 5గనిపై సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఏజెంట్ ఏవీ రెడ్డి, డీవైజీఎం అబ్దుల్ ఖాదర్, కార్మికులు డైరెక్టర్ సత్యనారాయణరావును కార్మికులతో కలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం గనిపై నిర్వహించిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కార్మికుల ఖాతాల్లోకి లాభాల వాటా

- కార్మికుల వేతనాల్లో 32 శాతం
- ఖాతాల్లోకి రూ. 711 కోట్లు
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

శ్రీరాంపూర్, అక్టోబర్ 20 : సీఎం కేసీఆర్ ప్రకటించిన సింగరేణి లాభాల వాటా డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. సంస్థ 2022-23 సంవత్సరానికి సాధించిన రూ. 2,222 కోట్ల లాభాల్లో 32 శాతం రూ. 711 కోట్ల బోనస్ చెల్లిస్తున్నారన్నారు. సీఎం ఆదేశంతో ఈ నెల 4న యాజమాన్యం ఈ నెల 16 చెల్లింపునకు సర్క్యులర్ జారీ చేసిందని, అయితే ఈ నెల 9న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. దీంతో యాజమాన్యం తెలంగాణ సీఈఎస్ లాభాల వాటా చెల్లింపుపై అనుమతి కోరుతూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారన్నారు. దీనిపై కొన్ని కార్మిక సంఘాలు రాద్ధాంతం చేస్తూ కార్మికులను గందరగోళంలో పడేసే ప్రయత్నం చేశాయన్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితను కలిసి ప్రభుత్వానికి విన్నవించామన్నారు. దీంతో ఈసీ సూచన మేరకు సింగరేణి యాజమాన్యం ఈ నెల 20న సాయంత్రం నుంచి కార్మికుల ఖాతాల్లో 32 శాతం లాభాల వాటా జమ చేస్తుందన్నారు. కార్మికులు, వారి కుటుంబాలు సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్మికులకు సంస్థ లాభాల వాటా ఇప్పించడంలో కృషి చేసిన టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత, అధ్యక్షుడు వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డికి ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# సింగరేణి డైరెక్టర్‌కు పరామర్శ


నివాళులర్పిస్తున్న బెల్లంపల్లి ఏరియా ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

రెబ్బెన, అక్టోబర్ 20 : సింగరేణి డైరెక్టర్ (పా) బలరాంనాయక్ తండ్రి హుణ్యానాయక్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బెల్లంపల్లి ఏరియా ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం డైరెక్టర్‌ను పరామర్శించినట్లు బెల్లంపల్లి ఏరియా ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దారావత్ మంగీలాల్ తెలిపారు. డైరెక్టర్ స్వగ్రామమైన తిరుమలగిరి బాలానగర్‌తండాలోని వారి ఇంటికి వెళ్లి హుణ్యానాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం డైరెక్టర్‌ను పరామర్శించినట్లు తెలిపారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తిరుమల్‌రావు, లైజన్ ఆఫీసర్ వీరన్న, ప్రెసిడెంట్ కృష్ణ ఉన్నారు.

# సింగరేణి గనుల్లో సమావేశాలు నిషేధం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్‌లో పని చేసే ఉద్యోగులు, రాజకీయ పార్టీల నాయకులు గనుల్లో, గనుల పరిసర ప్రాంతాలు, కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించడం నిషేధమని సింగరేణి సంస్థ సంచాలకుడు ఎన్. బలరాం ఆదేశాలు జారీ చేశారని భూపాలపల్లి అధికారి ప్రతినిధి తుకారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై ఆదేశాలను ధిక్కరించి సమావేశాలు నిర్వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ముందస్తు అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహిస్తే ఎలక్షన్ కమిషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి సమావేశాల్లో పాల్గొనకుండా చూడాలని, అలాగే సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరినట్లు తెలిపారు.

# కోలిండియా పోటీల్లోనూ సత్తా చాటాలి

- డైరెక్టర్ సత్యనారాయణరావు
- శ్రీరాంపూర్‌లో ముగిసిన సింగరేణి స్థాయి హాకీ పోటీలు


విజేత కార్పొరేట్ కొత్తగూడెం జట్టుకు బహుమతి అందించిన డైరెక్టర్ సత్యనారాయణరావు

శ్రీరాంపూర్, అక్టోబర్ 20 : సింగరేణి ఉద్యోగ హాకీ క్రీడాకారులు కోలిండియా పోటీల్లోనూ సత్తా చాటాలని డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు అన్నారు. శ్రీరాంపూర్‌లో సింగరేణి యాజమాన్యం నిర్వహించిన హాకీ సింగరేణి స్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేత కార్పొరేట్, కొత్తగూడెం జట్టు, రన్నరప్ శ్రీరాంపూర్ జట్టుకు డైరెక్టర్ బహుమతులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో జరిగే కోలిండియా హాకీ పోటీలకు కూడా శ్రీరాంపూర్ ఏరియా ఆతిథ్యం ఇవ్వడం సంతోషకరమన్నారు. క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో ఆడి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డి, డీవైజీఎం అరవిందరావు, ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్‌సింగ్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, డబ్ల్యూపీఎస్‌జీఏ కార్యదర్శి పాలకుర్తి రాజు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, జాన్‌వెస్లీ, కోఆర్డినేటర్ తోట సురేశ్, హాకీ కెప్టెన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### గండ్ర యువసేన

# నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా శంకర్

రేగొండ, అక్టోబర్ 20 : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు గండ్ర యువసేన భూపాలపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా గోరికొత్తపల్లికి చెందిన నిమ్మల శంకర్‌ను నియమించినట్లు అధ్యక్షుడు మాదాసి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి తదితరులకు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

